# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 28, ఫిబ్రవరి 2026






## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జాదవ్ ప్రకాష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్యలతో కలిసి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈలు, డిఈఈ, ఎఈఈలతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. డిఎంఎఫ్‌టి క్రింద చేపట్టిన మూత్రశాలలు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాలు, అంగన్వాడి కేంద్ర భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనులు పూర్తి అయిన వాటికి సంబంధించిన బిల్లులను సమర్పించాలని, ప్రధానమంత్రి జన్ మన్ క్రింద చేపట్టిన 5 అంగన్వాడీ కేంద్ర భవనాల నిర్మాణ పనులను పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**✳ మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో మంత్రి వివేక్**

**✳ పదవీ బాధ్యతలు చేపట్టిన చెన్నూరు మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు**



చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

చెన్నూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాల్టీలో శుక్రవారం రోజున నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులను గెలిపించి, మున్సిపాలిటీలో బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు ధన్యవాదాలు చెబుతున్నానని తెలిపారు. కౌన్సిలర్లు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. మున్సిపాలిటీలో సుమారు రూ.50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనేక వార్డుల్లో బోర్‌వెల్స్, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల్లో ఉంటూ, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, చెన్నూరును అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

**◆ జిల్లా ఎస్పీ నితికా పంత్**

**◆ కాగజ్‌నగర్‌లో 15 సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్పీ**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త



నేరాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ పర్యవేక్షణకు, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికాపంత్ అన్నారు. సీసీ కెమెరాలు ప్రజా భద్రతను మరింత పటిష్ఠం చేయాలనే లక్ష్యంతో కాగజ్‌నగర్ పోలీసులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నితికా పంత్ ముఖ్య అతిథిగా హాజరై కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక యుగంలో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల వినియోగం అత్యంత కీలకమని అన్నారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు, ట్రాఫిక్ మిగతా 2లో..

## బాల్క సుమన్ కస్టడీ పిటిషన్ కొట్టివేత

మంచిర్యాల, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా జరిగిన అల్లర్ల కేసులో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌పై పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే బాల్క సుమన్ సహా పలువురు నాయకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు, వారిని కోర్టులో హాజరుపరచగా గతంలోనే 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. అయితే, విచారణ నిమిత్తం 4 రోజుల కస్టడీతో పాటు పిటి వారంట్ మంజూరు చేయాలని రామకృష్ణాపూర్ పోలీసులు పిటిషన్ వేశారు. శుక్రవారం ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి వీరయ్య పోలీసుల కస్టడీ పిటిషన్‌ను, పిటి వారంట్‌ను రద్దు చేశారు. కాగా, బాల్క సుమన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సాయంత్రం వాదనలు ముగియగా, తీర్పును కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

## గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు

**➾ జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్**



ఉట్నూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతుందని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం ఉట్నూరు పరిధిలోని కుమ్మరి గుంట, కామయి పేట్ పసుపుల గ్రామాలలో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ తో కలిసి పర్యటించి గిరిజనుల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ గిరిజనులకు త్రాగునీరు, విద్యుత్, వర్షాకాలంలో ఎదురయ్యే రవాణా సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా అర్హులైన గిరిజనులకు పథకం ఫలాలు అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలం ఎదురయ్యే ఇబ్బందులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అటవీశాఖ అధికారుల అడ్డగింపు అంశాలను ఆయా గ్రామాల ప్రజలు జాతీయ కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకోవచ్చారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఒక వారంలో పివిటిజి గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం పై అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజనుల ఆరోగ్యం, విద్య, మిగతా 2లో..

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

(మొదటిపేజీ తరువాయి)

పర్యవేక్షణకు, ప్రజల భద్రతకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పాత కిమ్స్ హాస్పిటల్ పరిసర ప్రాంతంలో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, బస్టాండ్, ఎన్టీఆర్ చౌరస్తా, ఆసిఫాబాద్ వైపు ప్రధాన రహదారి, సిర్పూర్ వైపు ప్రధాన రహదారి తదితర కీలక ప్రాంతాలు స్పష్టంగా కనిపించే విధంగా కెమెరాలను అమర్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డా. కొత్తపల్లి శ్రీనివాస్ ఐఎంఏ కార్యదర్శి డా.శ్రావణ్ కుమార్, కోశాధికారి డా. రమాకాంత్ రావు, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ డా. కొత్తపల్లి అనిత, ఐఎంఎస్ సభ్యులు డా.కృష్ణారావు, డా.ముందాడ,డా.రావుజీ, డా.సునీత, డా.రమేష్ బాబు, డా.విద్యాసాగర్, డా.జ్యోతి, డా.సాయి వివేక్,డా.ప్రజ్వల, డా.సుదీప్, సీఐ ప్రేమ్ కుమార్, పోలీస్ సిబంది, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించామని, రహదారి సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి రోడ్డు సదుపాయం కల్పిస్తామని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలు, పంచాయితీ కార్యాలయ భవనాలు, పాఠశాలలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పివిటిజి కొలాం గిరిజనులలో కళా నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జాతీయ కమిషన్ సభ్యులు అరకపూర్, అందుగూడ గిరిజన గ్రామాన్ని పర్యటించి కేస్లాపూర్ నాగోబా దేవతను దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్, జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్, డిటిడిఓ అంబాజీ, షెడ్యూల్డ్ తెగల కమిషన్ కార్యదర్శి కళ్యాణ్ రెడ్డి, సంచాలకులు అశోక్ కుమార్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, జగన్, శేషరావు,సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, కొలం నాయకులు వసంత్ రావు, సోనే రావు తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్ల మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మంత్రి వివేక్

## టేకుమట్ల మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మంత్రి వివేక్

జైపూర్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త

మండలంలోని టేకుమట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోనె నర్సయ్య తండ్రి పోషం ఇటీవల మృతి చెందారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి నర్సయ్యనివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం గ్రామీణ ప్రాంతంలో కార్యకర్తలకు, నాయకులకు అన్ని వేళల్లో అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టేకుమట్ల సర్పంచ్ బల్ల వెంకటేష్, ఇందారం సర్పంచ్ ఫయాజ్,ఎల్కంటి సర్పంచ్ గుడెల్లి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ రెడ్డి. విశ్వంబర్ రెడ్డి, అన్నం వెంకన్న, తిరుపతి గౌడ్, అంబల రవీందర్ రెడ్డి, అంబల సంపత్ రెడ్డి, కాసిపేట సతీష్, జక్కుల వెంకటేశం, వేముల రవీందర్ గౌడ్, అరిగెల శ్రీనివాస్ గౌడ్, పండుగ రాజన్నలు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

తాండూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని ఐబి వద్ద గల బ్రిడ్జి కింద శుక్రవారం స్కూల్ బస్సు ఢీకొని తాండూర్ కు చెందిన మనోహర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. తాండూర్ మండలం రేపల్లెవాడ సెయింట్ థెరిస్సా స్కూల్ కు చెందిన బస్సు విద్యార్థులను పాఠశాలకు తీసుకుని వెళ్తుండగా బ్రిడ్జి కింద బైక్ పై వెళ్తున్న మనోహర్ ను ఢీకొంది. వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు.



# ఈజిఎస్ సిబ్బంది, కార్యదర్శులపై డిఆర్డిఓ పిడి ఆగ్రహం

**- పక్కదారి పట్టిన నిధులు రికవరి చేయాలని ఆదేశం**



సామాజిక తనిఖీ ప్రజావేదికలో జరిగిన పీడి, అధికారులు

తాండూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :

మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు నిబంధనలను ఉల్లంఘించి ఇష్టానుసారంగా నిర్వహించిన సంబంధిత అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులపై మంచిర్యాల డీఆర్డీవో పీడీ కిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఈజీఎస్సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కూలీలకు జాబ్ కార్డుల మంజూరు, మస్టర్లు లేకుండానే కూలీలకు వేతనాల చెల్లింపు, పనుల కొలతలలో తేడాలు, రికార్డుల నిర్వహణ, ఇష్టానుసారంగా విధుల నిర్వహణలో నిబంధనలను తుంగలో తొక్కినట్లు తనిఖీ బృందాల సభ్యులు ప్రజా వేదికలో గ్రామ పంచాయతీల వారీగా చదివి వినిపించారు. సామాజిక తనిఖీలలో బహిర్గతమైన కూలీల బిల్లుల చెల్లింపు, పక్కదారి పట్టిన నిధులు, విధులలో సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజావేదికలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. దీంతో పిడి వారిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన, నిధులు పక్కదారి పట్టిన సహించేది లేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని లేనిపక్షంలో చర్యలు తప్పని పిడి హెచ్చరించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలలోపక్క దారి పట్టిన రూ.140588 నిధులను సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు నుంచి రికవరి చేయాలని పిడి ఆదేశించారు. ప్రజా వేదికలోమంచిరాల విజిలెన్స్ అధికారి కిరణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, స్టేట్ రిసోర్స్ పర్సన్ రవి, స్టేట్ టీం మానిటరీ ఆఫీసర్ వేణు, ఏపీవో నందకుమార్, డిఆర్పీలు, గ్రామ కార్యదర్శి , టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పరీక్షల ఒత్తిడికి లొంగవద్దు-విద్యార్థులకు నిపుణుల సూచనలు



**విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక కార్యక్రమం**

మందమర్రి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత ఆదేశాల మేరకు మందమర్రి జిల్లా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం, మానసిక ఒత్తిడిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్షల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంపొందించడం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్ఓ కాకిరాల వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, జై వంతరావు, ఆరోగ్య సిబ్బంది పద్మ, లలిత, సురేఖ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వినిపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు బోర్డు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం విద్యార్థుల మానసిక ధైర్యాన్ని పెంపుతుందని, ఇది వారి ఆరోగ్యానికి, చదువులో ఏకాగ్రతకు దోహదపడుతుందని తెలిపారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలంటే సమతుల్య ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం 8 గంటల పాటు నిద్రపోవడం, వ్యాయామానికి సమయం కేటాయించడం అవసరమని వివరించారు. అలాగే సుదీర్ఘ సమయం చదువుకు కేటాయించడం వల్ల శారీరక చురుకుదనం తగ్గి, మెదడు పనితీరు ప్రభావితం అవుతుందని పేర్కొన్నారు. అందువల్ల చదువుతో పాటు వ్యాయామం, విశ్రాంతి, మంచి అలవాట్లను అలవరచుకోవడం ద్వారా శరీరం, మనసు ఆరోగ్యంగా ఉంటాయని సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉండటం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో సమతుల్య, వేడి ఆహారం అందించడం విద్యార్థుల ఆరోగ్యానికి ఉపయోగకరమని చెప్పారు. వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండి, అవసరమైతే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేసి, మానసిక ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి లొంగకుండా ధైర్యంగా పరీక్షలను ఎదుర్కోవాలని అధికారులు కోరారు.

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ తరగతులు

జైపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త



శిక్షకులు,పంచాయతీ కార్యదర్శులతో ఎం.పి.డి.ఓ సత్యనారాయణ, ఎం.పి.ఓ బాపు రావు

మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని 10 గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతులలో 94 మంది వార్డు సభ్యులు హాజరయ్యారని అధికారులు తెలిపారు.నలుగురు శిక్షకులు ఐదు రోజులు వార్డు సభ్యులకు సర్పంచ్, వార్డు సభ్యుల విధులు, నూతన పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీ ఆదాయ వ్యయాలు, నిర్వహించే రికార్డులు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల పథకాలు తదితర అంశాలపై శిక్షణ అందించారు. వార్డు సభ్యులు నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ ఐదు రోజుల శిక్షణ తరగతులు తమకు ఎంతగానో ఉపయోగ పడ్డాయని, చాలా కొత్త విషయాలు నేర్చుకున్నామని, పంచాయతీరాజ్ చట్టంపై, ఇతర అంశాలపై పూర్తి అవగాహన కల్పించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి.సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు రావులు మాట్లాడుతూ నేర్చుకున్న అంశాలను గ్రామ పంచాయతీలలో అమలులోకి వచ్చేటట్లు చేసి, గ్రామ పంచాయతీలను ప్రగతి పథంలో నడిపించాలని సూచించారు. అనంతరం, వార్డు సభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు పి.సురేష్, ఎన్.దేవేందర్, ఎం.సురేష్, ఈ.రమేష్, ఇందారం సర్పంచ్ ఫయాజ్, పంచాయతీ కార్యదర్శులు సుమన్, సురేష్, ఉదయ్, సత్యనారాయణ, సురేందర్,సాయి రజిత,తిరుమల,రమాదేవి,పావని, వివిధ గ్రామాల వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల భయం వద్దు.. ధైర్యంగా ముందుకు సాగండి

**- 10వ తరగతి విద్యార్థినులకు మోటివేషనల్ సదస్సు**

కోటపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా,కోటపల్లి మండలం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించేందుకు మోటివేషనల్ సమావేశం నిర్వహించారు. సైకాలజిస్ట్ సుమన చైతన్య మాట్లాడుతూ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవాలని, ప్లాన్ ప్రకారం చదవడం, రివిజన్ చేయడం, మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన బాలికల అభివృద్ధి అధికారి లావణ్య, హెడ్‌మాస్టర్ మధునయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ - సింగరేణి ఉన్నత పాఠశాల 48వ వార్షికోత్సవం

**నస్పూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

గత 48 ఏళ్లుగా సిసిసి నస్పూర్ సింగరేణి పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థితికి చేరుకున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. సిసిసి నస్పూర్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల 48వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మునిగంటి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాల కీర్తిని దశదిశలా చాటాలని పిలుపునిచ్చారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ వేదికపై ప్రత్యేకంగా అభినందించారు. 2024-25 విద్యాసంవత్సరంలో 540 మార్కులు సాధించిన నాహేద బేగంకు 2000 రూపాయల నగదు బహుమతి అందజేశారు. అలాగే 525 మార్కులు సాధించిన అమూల్యకు 1000 రూపాయల నగదు పురస్కారాన్ని జనరల్ మేనేజర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి బహుమతులు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎస్. సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ ఎం. రాజేష్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్



## బడి ఉంటేనే భవిష్యత్తు: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### - సోనాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ

**నేరడిగొండ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

సోనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 21 లక్షల వ్యయంతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్‌కు ఎంపీ గోడం నగేష్‌తో కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. అలాగే నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి గుడితో పాటు బడి కూడా ఎంతో ముఖ్యమన్నారు. తాము చదువుకునే రోజుల్లో రేకుల షెడ్లలో ఇబ్బందులు పడ్డామని, నేడు విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోందని గుర్తుచేశారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను వాడుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిందుజా సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



## వివో మహిళా సంఘం భవనానికి భూమి పూజ

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

మండలంలోని అంకత్‌పల్లి గ్రామపంచాయతీలో వివో మహిళా సంఘం భవనానికి శుక్రవారం రోజున భూమి పూజ చేసినట్లు సర్పంచ్ లత-వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ.. వి ఓ మహిళా సంఘం భవనం ఎంతో ఉపయోగకరమైందని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ కార్యక్రమం ప్రారంభించిన మహిళలకే ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. సంఘంలోని ప్రతి ఒక్కరు నియమ నిబంధనలు పాటిస్తూ వివో మహిళా సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఏపిఎం భూమక్క, సర్పంచ్ లత -వెంకటేష్, బానేష్, ఉప సర్పంచ్ పొచకుమార్, వార్డు సభ్యులు శ్రీనివాస్, అవునూరి సత్తయ్య, సాయికుమార్, దుర్గ, శ్రీలత, మోనిక తిరుపతి, పెరక శ్రీనివాస్, సెక్రటరీ, ప్రదీప్ కుమార్, పొతేపల్లి, సెక్రటరీ సత్తయ్య, కారోబార్ లెంకలా తిరుపతి, లచ్చన్న, నాయకులు అవునూరి. చిన్నయ్య, లింగంపల్లి దుర్గయ్య, అవునూరి రాజయ్య, ప్రేమలత, చొప్పదండి సంధ్య, లింగంపల్లి సుమలత, తదితరులు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణం కోసం ఇరవై వేల పదహారు రూపాయల విరాళం

**జన్నారం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

జన్నారం మండలం లోని మందపల్లి గ్రామంలో అగ్గి మల్లన్న స్వామి గుడి నిర్మాణం చేపట్టారు. గుడి నిర్మాణం కోసం విరాళాలు చేపట్టే కార్యక్రమంలో భాగంగా జన్నారం వాస్తవ్యులు, రాఘవేంద్ర గ్రూప్ అధినేత, మాజీ జడ్పీటిసి ఎర్ర చంద్రశేఖర్ ను కలిసి గుడి నిర్మాణం కోసం విరాళం గురించి చెప్పగానే ఇరవై వేల పదహారు రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మందపల్లి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.


గుడి నిర్మాణం కోసం విరాళం అందచేస్తున్న దృశ్యం

## ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారిగా గోడం చందన్ బాధ్యతల స్వీకరణ

**ఉట్నూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :**

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ఉప విద్యాశాఖ అధికారిగా గోడం చందన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఐ టి డి ఎ ఉట్నూరు పరిధిలోని గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసిస్తున్న విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గిరిజన విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు క్రమశిక్షణతో ఉండాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాలలో బడి వయసు పిల్లలను బడికి వచ్చే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న గోడం చందన

## నిరుద్యోగులు జాబ్ మేళాను అందిపుచ్చుకోవాలి

### - సిరికొండ ఎస్సై పూజ

**సిరికొండ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మార్చి 10వ తేదీన ఆదిలాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై పూజ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివి సరైన ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న మండల యువతకు ఈ మేళా ఒక చక్కని వేదిక అని పేర్కొన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ భవిష్యత్తును బాగు చేసుకోవాలని ఆమె సూచించారు.



## శబరిమాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే

**నేరడిగొండ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

బోథ్ మండలంలోని కౌట(బి) గ్రామంలో వెలసిన శ్రీ శబరిమాత ఆశ్రమ 14వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, మాతాజీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో శబరిమాత భక్తులు విశేష సంఖ్యలో ఉన్నారని, ఆధ్యాత్మిక చింతనతోనే మనశ్శాంతి లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తి మార్గంలో పయనిస్తూ, సోదరభావంతో మెలగాలని ఆయన ఆకాంక్షి ంచారు. ఈ వేడుకల్లో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, ఉప సర్పంచ్ రమణ రెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులు, శాస్త్రవేత్తల చర్చ గోష్టి కార్యక్రమం

**హాజీపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడి పేట రైతు వేదికలో రైతులు శాస్త్రవేత్తల చర్చ గోష్టి కార్యక్రమం శుక్రవారం రోజు నిర్వహించారు. ఆత్మ పథకం 2025-26లో భాగంగా, మంచిర్యాల, చెన్నూర్ డివిజన్ల రైతుల కోసం గుడిపేట రైతు వేదికలో ఖగరైతులు, శాస్త్రవేత్తల పరస్పర చర్చా గోష్టి కార్యక్రమంగా నిర్వహించారు. ఇందులో 50 మంది రైతులు పాల్గొని పంట పొలాల్లోని వివిధ సమస్యలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో సంభాషించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, రైతులు సేంద్రియ వ్యవసాయం మీద దృష్టి సాధించాలని అధికారులు, సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు, మిగతా రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారిణి సురేఖ మాట్లాడుతూ రసాయన రహిత సహజ వ్యవసాయం పర్యావరణానికి మేలు చేస్తుంది. ఆధునిక సాంకేతికతను జోడిస్తే దిగుబడి, ఆదాయం రెండూ మెరుగుపడతాయి. భవిష్యత్తులో సుస్థిర వ్యవసాయం కోసం ఈ సమన్వయ పద్ధతి అత్యవసరం. సహజ వ్యవసాయం భవిష్యత్తు సుస్థిర వ్యవసాయానికి బలమైన మార్గం. ప్రకృతి సహజ విధానాలను అనుసరించడం ద్వారా రైతు ఆదాయం పెరిగి, వినియోగదారులకు విషరహిత ఆహారం అందుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లగిశెట్టి రాజయ్య, ఆత్మ చైర్మన్ సింగతి మురళీ ఏఎంసి చైర్మన్ పయ్యావుల పద్మ ముని, కేవీకే శాస్త్రవేత్త సాధ్వి, ఏడిఏలు మంచిర్యాల డివిజన్ క్రిష్ణ, చెన్నూరు డివిజన్ ప్రసాద్, హాజీపూర్ ఏఓ కృష్ణ, డివిజన్‌లోని వివిధ మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి సురేఖ

# అత్యంత వైభవంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ భూమి పూజ కార్యక్రమం


● పూర్వ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో పాఠశాల పునః నిర్మాణం

**మందమర్రి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పునః నిర్మాణంలో భాగంగా శుక్రవారం రోజున శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థి పరిషత్, ప్రబంధకారిణి, ఆచార్య బృందం ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందమర్రి ఎమ్మార్వో పి. సతీష్ కుమార్ శర్మ, సరస్వతీ విద్యాపీఠం నుండి పతకమూరి శ్రీనివాసరావు, రావుల సూర్యనారాయణ, రాజారెడ్డి పాల్గొనడం జరిగింది. వేద మంత్రాల నడుమ భూమి పూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం శ్రీధర్ దంపతులు పూజలో పాల్గొన్నారు. భూమి పూజ అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల పునర్ వైభవాన్ని తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమని వక్తలు తెలియజేశారు. ప్రతి ఒక్క పూర్వ విద్యార్థి తో పాటు సమాజ శ్రేయస్సు కోరుకునే ప్రతి ఒక్కరూ దీనిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సంస్కృతికి, సమాజ శ్రేయస్సు కు నిలువుటద్దంగా నిలిచే శిశు మందిరాలను నిర్మించుకోవాలనే ఆకాంక్షతో అందరూ ముందుకు కదం తొక్కలని, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యమై శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలను నిర్మించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి మహోత్తర కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని, వారి సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దహేగాం గోవిందరావు, డాక్టర్ విష్ణువర్ధన్ రావు, పొడిపాక విద్యాసాగర్, బిజెపి నాయకులు అందుగుల శ్రీనివాస్, సామాజికవేత్త డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్, మందమర్రి వ్యాపార సంఘం అధ్యక్షులు తమ్మిశెట్టి విజయ్, వ్యాపారవేత్తలు సిరిపురం శ్రీనివాస్, బత్తుల సతీష్, గద్దం అనిల్, దొంతుల సారయ్య, మంచిర్యాల జిల్లా విద్యాపీఠం నుండి గుండం అశోక్, సూరం లక్ష్మీనారాయణ, మంచిర్యాల, బెల్లంపల్లి సరస్వతి శిశు మందిర్ పాఠశాలల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఆచార్య బృందం, ప్రబంధకారిణి, పూర్వ విద్యార్థులు, శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో భూమి పూజ కార్యక్రమం



## ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

### - రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం

**సారంగాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిలో అరైవ్ అలైవ్ 2026 కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, డ్రైవర్లలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో అలసట, కంటి చూపు మందగించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్న ఆయన, ముఖ్యంగా లాంగ్ డ్రైవింగ్ చేసేవారు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ (జి) ఎస్ఐ గణేష్, పోలీస్ సిబ్బంది, మండలంలోని ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## స్మార్ట్ ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి

### ఖాకీ కిడ్స్ కార్యక్రమంలో సైబర్ నేరాలపై అవగాహన

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించాలని పోలీస్ కానిస్టేబుల్ విష్ణు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కురుక్షేత్ర పాఠశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "ఖాకీ కిడ్స్" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో వచ్చే తెలియని లింక్‌లను క్లిక్ చేయకూడదని, అపరిచితులతో జాగ్రత్తగా వ్యవహరించాలని వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని తెలిపారు. పోలీసులంటే భయం పోగొట్టి, వారు రక్షణ కోసమే ఉన్నారనే నమ్మకాన్ని కలిగించేలా సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సబ్బిడీ నవీన్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ సంధ్యారాణి

**సారంగాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ సంధ్యారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు ప్రశాంతంగా రాయాలని సూచించారు. నిబంధనల ప్రకారం పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

**సిరికొండ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**



ఇచ్చోడ మండలం బోరిగామ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును మండల పరిషత్ అభివృద్ధి అధికారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించడంతో పాటు, వంట గదిని, నిల్వ ఉంచిన బియ్యం, నిత్యావసర సరుకులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. భోజనం వడ్డించే ముందు ఉపాధ్యాయులు తప్పనిసరిగా రుచి చూడాలని, వంట చేసే ప్రదేశంలో పరిశుభ్రతను పాటించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆయన, వారితో కాసేపు ముచ్చటించి భోజనం రుచి, నాణ్యతపై ఆరా తీశారు. విధుల్లో నిరక్ష్యం వహించే వంట ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంపీఓ అతూల్ కుమార్, సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో అభివృద్ధి పనులకు భూమిపూజ

**నేరడిగొండ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

మండలంలోని లఖంపూర్ ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌తో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిబ్బంది నివాస గృహాలకు, అలాగే రూ. 21 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులకు వారు శ్రీకారం చుట్టారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బందికి తగిన వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులు ప్రారంభం

**దండేపల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం కన్నెపల్లి గ్రామ చెరువు పూడికతీత పనులను గ్రామ సర్పంచ్ చుంచు నగేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్తే శంకరయ్య, మాజీ ఎంపీటీసీ ముత్తే నారాయణ వార్డు సభ్యులు తోట వినోద-మహేష్, ఉపాధి హామీ పథకం సంబంధిత అధికారి జగన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధి హామీ పథకం కార్మికులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ గోపి కిషోర్

## ఆర్థిక అక్షరాస్యతపై అవగహన సదస్సు

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండలం బొంబాయిగూడ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామస్తులకు బ్యాంకింగ్ సేవలు, పొదుపు ప్రాముఖ్యత, డిజిటల్ లావాదేవీలు, ప్రభుత్వ పథకాలపై వివరించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎల్కపల్లి శాఖ మేనేజర్ గోపి కిషోర్ బ్యాంకు సేవల వినియోగం, రుణాల సద్వినియోగం, మోసపూరిత కాల్స్ పై జాగ్రత్తలు సూచించారు. కేంద్ర ప్రభుత్వ భీమా, పెన్షన్ పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవం జ్యోతి భీమా యోజన, అటల్ పెన్షన్ యోజనల గురించి వివరించి నమోదు చేసుకోవాలని సూచించారు. సీఎఫ్ఎల్ కౌన్సలర్లు రాజబాబు, శేఖర్, మల్లేష్ యూపీఐ, ఏఈపీఎస్ వంటి డిజిటల్ చెల్లింపులు, సేవింగ్స్ ఖాతాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

# మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చేలా పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

**● ఎమ్మెల్సీ దంటే విఠల్‌కు వినతిపత్రం అందజేసిన మాలీ కులస్థులు**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

మాలీలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు తమ వంతుగా కృషి చేసి పార్లమెంట్లో బిల్ పాస్ చేయడానికి 8 మంది కాంగ్రెస్ ఎంపీలతో పార్లమెంట్లో మాలి కులస్తుల ప్రస్తావన తీయాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్‌కు ఆయన నివాసంలో మాలీ సంఘం నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని మాలీ కులస్థులు గత 40 సంవత్సరాల నుండి ఎస్టీ హోదా కావాలని పోరాటాలు చేస్తున్నామని, ఆర్థికంగా, సామాజికంగా, విద్యా,ఉద్యోగ పరంగా చాలా వెనుకబడి ఉన్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేందుకు అవకాశం కల్పించాలని వారు ఎమ్మెల్సీకి కోరారు. అంతకు ముందు ఎమ్మెల్సీ దండే విఠల్‌కు పూలమాల శాలువాతో మాలీ సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావు, ఉపాధ్యక్షుల నాందేవ్, మాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్లే శ్రీనివాస్, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సెండే వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి నీకోడే గంగారం, ఉపాధ్యక్షులు గోపాల్ అదే శ్రీనివాస్, వాంకిడి మండల అధ్యక్షుడు బాపూరావు, కాగజ్ నగర్ మండల అధ్యక్షుడు విజయ్, మాలి సంఘం నాయకులు రామకృష్ణ, సురేశ్, యువజన సంఘం నాయకులు పాండు రంగ్, శ్రీనివాస్ మాలి కులస్తులు, పూలే సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ దండే విఠల్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాలీ సంఘం నాయకులు



# గల్ఫ్ మృతుల కుటుంబాల దీనస్థితిపై ఢిల్లీ జర్నలిస్ట్ అధ్యయనం

**సారంగాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

గల్ఫ్ దేశాలలో ఉపాధి కోసం వెళ్లి మరణిస్తున్న కార్మికుల కుటుంబాల పరిస్థితులను, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను జాతీయ స్థాయిలో వెలుగులోకి తెచ్చేందుకు ఢిల్లీకి చెందిన ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ పూనమ్ అగర్వాల్ శుక్రవారం లక్ష్మణచందా మండల కేంద్రంలో పర్యటించారు. ఐదు నెలల క్రితం దుబాయ్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన బీమా రమేష్ నివాసానికి ఆమె వెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ భార్య, తల్లిదండ్రులను కలిసి పరామర్శించారు. రమేష్ మరణానికి గల కారణాలు, మృతదేహం స్వదేశానికి రావడానికి పట్టిన సమయం, ప్రభుత్వం నుండి అందిన ఆర్థిక సహాయం వంటి వివరాలను ఆమె ఆరా తీశారు. గల్ఫ్ దేశాల్లో భారతీయులు మరణించినప్పుడు ఎదురయ్యే ఇబ్బందులపై అధ్యయనం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎన్నారై అడ్వైజర్ కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల, నిర్మల్ మార్కెట్ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఒస రాజేశ్వర్, జిల్లా కిసాన్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అట్ల పోతరెడ్డి, బిక్నూర్ రాజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈజీఎస్ జాబు కార్డు కోసం ప్రజావేదికలో యువతి ఆవేదన

**- ఈజీఎస్ సిబ్బంది నిరక్ష్యం చేస్తున్నారని ఆరోపణ - డిఆర్డిఓ పిడి ఆదేశాలతో వెంటనే జాబ్ కార్డు జారీ**

**తాండూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం జాబ్ కార్డు జారీలో నిరక్ష్యం చేస్తున్నారని తాండూర్ మండలం గోపాలరావు పేటకు చెందిన అల్లం సరిత ఆరోపించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం డిఆర్డిఒ పిడి కిషన్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కోసం కొన్ని నెలలుగా ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని ప్రజావేదికలో అల్లం సరిత అనే యువతి ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ కార్డు ఇవ్వడంలో ఈజీఎస్ సిబ్బంది నిరక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. డిఆర్డిఒ పిడి కిషన్ స్పందించి సరితకు జాబు కార్డు ఎందుకు ఇవ్వడం లేదని ఈజీఎస్ ఎపిఎం, ఈజీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిడి ఆగ్రహంతో ఈజీఎస్ సిబ్బంది సరితకు వెంటనే జాబ్ కార్డు అందజేశారు. ఈ సందర్భంగా సరిత స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలల కింద జారీ అయిన జాబ్ కార్డును ఈజిఎస్ సిబ్బంది తనకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జాబు కార్డు లేక ఉపాధి హామీ పనులకు వెళ్లలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ కార్డు ఇవ్వడంలో నిరక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.






చెన్నూరులో హాట్‌టాపిక్‌గా మారిన ఫ్లెక్సీ

# ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలి

**✻ ఏడీఏ మనోహర్ ✻ విలేజ్ నెం.12లో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :**

ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలని ఏడీఏ మనోహర్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం విలేజ్ నెం. 12లో నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను రైతులకి వివరించారు. అదే విధంగా యూరియా బుకింగ్ యాప్ గురించి, పంట నమోదు పైన అవగాహన కల్పించారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ సబ్సిడీ పథకాల గురించి రైతులకు వివరించారు. రైతులకి ఎలాంటి ప్రభుత్వ పథకాలు వర్తించాలన్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. అంతకు ముందు ఏఈఓ శ్రీనివాస్ రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పైన అవగాహన కల్పించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొని వారికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్ సర్కార్, ఏఈఓ శ్రీనివాస్, దుర్గయ్య, వెంకటేష్, రైతు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ మనోహర్



హాజరైన రైతులు

# ప్రతిపక్షంలో ఉన్నవారు పాలకవర్గ సభ్యులు కారా...!


**- చెన్నూరు మున్సిపాలిటీలో హాట్‌టాపిక్‌గా మారిన ఫోటో ఫ్లెక్సీ**

**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**

మున్సిపాలిటీలో పాలకవర్గం అంటే ప్రజలతో ఎన్నుకోబడిన వివిధ పార్టీలకు సంబందించిన కౌన్సిలర్లు, మున్సిపాలిటీలో బాధ్యతలు చేపట్టిన వెంటనే పాలకవర్గం అంటారు. దీనికి విరుద్ధంగా చెన్నూరు మున్సిపాల్టీలో వెలసిన ఒక ఫ్లెక్సీ ఇప్పుడు చెన్నూరు లో హాట్ టాపిక్ గా మారింది. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీ ఆఫీసు దగ్గర పెట్టిన ఫ్లెక్సీ లో అధికార పార్టీ కౌన్సిలర్లు తప్ప, ప్రతి పక్షం కౌన్సిలర్ల ఫోటోలు లేవు. పాలకవర్గానికి సందించిన ఫ్లెక్సీలో పార్టీలకతీతంగా ఉన్న సభ్యుల ఫోటోలు ఉండాలి కానీ, ఫ్లెక్సీలో కేవలం అధికార పార్టీకి సంబంధించిన కౌన్సిలర్ల ఫోటోలతో ఉండడంతో పురవాసులు ముక్కున వేలేసుకుంటున్నారు.

# ప్రెస్‌క్లబ్ అధ్యక్ష పదవి నుంచి నరసయ్యను తొలగించలేదు

**జన్నారం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న చిలువేరి నర్సయ్యను అధ్యక్ష పదవి నుంచి తొలగించలేదని అధ్యక్షుడు నరసయ్య స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వ్యక్తి పనిగట్టుకుని వరుసగా కథనాలు రాస్తూ సాధారణ ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాడని, తను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిని ఆయన కుటుంబం పరువును తీస్తున్నందున ఆ వ్యక్తిపై పరువు నష్టం దావా వేసినట్లుగా ఆయన పేర్కొన్నారు. జర్నలిజం పట్ల ఎలాంటి అవగాహన లేని సదరు వ్యక్తి విలేకరుల వ్యక్తిగత సమాచారాన్ని పత్రికల్లో రాస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని, త్వరలోనే అతన్ని చట్టపరంగా శిక్షించేలా ముందుకు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.